www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 23 అక్టోబర్ 2025

5

చిత్తూరు

వినాయకుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి- ఐరాల: శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రం, చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, చిత్తూరు కోర్టు సిబ్బంది ఉన్నారు.

జడ్జికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ

వర్ష బీభత్సం..

- జిల్లాలో ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు
- నిండిన చెరువులు, కుంటలు
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- అప్రమత్తమైన అధికార యంత్రాగం
- కంట్రోల్ రూములు ఏర్పాటు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా తాజాగా వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. అల్పపీడనాలు మరింత బలపడి కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జిల్లాలోని వంకలు, వాగులు, నదులు వరద నీటితో ఉధృతంగా పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు పూర్తిగా నిండి కళకళ లాడుతున్నాయి. జిల్లాలో గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. నీటి ఉధృతి దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

కుండపోత వర్షాలతో జిల్లాలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, ప్రాజెక్టులు, రిజర్వాయర్లు నిండుకుండలను తలిపిస్తున్నాయి. జిల్లాలో ఎటు చూసినా వాగులో నీరు ప్రవహిస్తోంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షాలకు రోడ్లు, కల్వర్టులు తెగిపోయి రవాణాకు ఇబ్బదులు ఏర్పడాయి. గతేది జూన్ నాటికి జిల్లాలో నమోదైన వర్షపాతంలో పోల్చితే ఈ ఏడాది జూన్ నాటికి 22 శాతం అధిక వర్షపాతం నమోదు అయ్యింది. ఇంతటి భారీ వర్షాలు కురుస్తున్నా జిల్లాలో నేటికీ 4,5 మండలాల్లో అత్యంత అల్ప వర్షపాతం నమోదు కావడం విశేషం.

జిల్లాలోని మండలాల్లో వర్షపాతం వివరాలు

జిల్లాలో అధ్యధికంగా విజయపురం 99.2, పెనుమూరు 86.6, కార్వేటినగరం 80.4, వెదురుకుప్పం 79.4, పూతలపట్టు 79.2, నింద్ర 70.4 మిలీమీటర్లు వర్షపాతం నమోదు అయ్యింది. అలాగే ఐరాల 59.6, నగరి 54.8, రొంపిచెర్ల 40.6, సోమల 31.0, చౌడేపల్లి 27.0, పుంగనూరు 21.2, పెద్దపంజాణి 16.6, గంగవరం 26.6, తవణంపల్లి 35.8, ఎస్ఆర్‌పురం 40.2, జీడీ నెల్లూరు 37.2, చిత్తూరు అర్బన్ 31.8, చిత్తూరు రూరల్ 35.2, పలమనేరు 20.4, బైరెడ్డిపల్లి 22.2, వెంకటగిరి 27.0, శాంతిపురం 23.4, కుపం 24.0, రామకుప్పం 33.8, బంగారుపాళ్యం 32.6, యాదమరి 34.4, గుడిపాల 27.2, పాలసముద్రం 35.6, సదుం 29.0, పులిచెర్ల 28.4, గుడిపల్లి 18.6.

తుఫాను హెచ్చరికలతో అధికార యంత్రాగం అప్రమత్తం

కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు

జిల్లాలోని ఎన్‌టిఆర్ జలాశయం గేట్లు ఎత్తి దిగువకు నీరు వదులుతున్నారు. కృష్ణాపురం రిజర్వాయర్‌కూ పూర్తిస్థాయిలో నిండి దిగువలకు నీరు వదులుతున్నారు. జిల్లాలో 4,122 చెరువులున్నాయి దాదాపు అన్ని చెరువులో వర్షపు నీరు చేరింది. 31 మండలల్లో 15 మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కావడం జరిగింది. 595 చెరువులు పూర్తి స్థాయిగా నిండాయి. 75శాతం నిండిన చెరువులు 491, 50 శాతం నీరు ఉన్న చెరవులు 1,326 25 శాతం 1100, 50 శాతం కంటే నీరు తక్కువ ఉన్న చెరువులు 500 ఉన్నట్లు జలవనరులశాఖ అంచనా. మరో మూడు రోజులు క్రమంగా వర్షాలు పడితే జిల్లాలోని దాదాపు అన్ని చెరువులు పూర్తిస్థాయిలో నీటితో నిండే అవకాశముంది.

చెరువులు, ప్రాజెక్టులు, రిజర్వాయర్ల వద్ద ఎలాంటి సంఘటనలో చోటు చేసుకోకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గతంలో నీరు-చెట్టు పనుల వల్ల చెరువుల సప్లైయ్ ఛానల్స్ బాగుచేయడంతో చెరువుల్లో వరద నీరు చేరుతోంది. బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం బుధవారం మరో అల్పపీడనం ఏర్పడే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు జిల్లా యాత్రగం అప్రమత్తమైయింది. 48 గంటల్లో వాయుగుండంగా మారనున్న అల్పపీడనం దక్షిణ కోస్తా, రాయలసీమలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముంది. వాతావరణ హెచ్చరికల మేరకు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు తగు జాగ్రత్తలు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్లో కంట్రోల్ నెంబర్ ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కంట్రోల్ నెంబర్‌ను 94910 77325 08572- 242777 ఏర్పాటు చేశారు. అతి భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు జాగ్రత్త చర్యలకు ఆదేశించారు. ముఖ్యంగా సీజనల్ ప్రబలకుండా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తగు జాగ్రత్తలపై దృష్టిపెట్టాల్సి ఉంది. వంకలు, వాగులు, నదులు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. పిల్లలను వాటి వద్దకు వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో చర్యలు: కమిషనర్ నరసింహ ప్రసాద్

అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. బుధవారం కమిషనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు, నగరపాలక సిబ్బందితో కలిసి నీటి ప్రవాహం ఉన్న లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడ ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం నగరపాలక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మరో రెండు, మూడు రోజులు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచనలతో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా నీవా నదిలో నీటిమట్టాన్ని అంచనా వేస్తూ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. నగరంలో ఎక్కడా వర్షపు నీటి నిల్వాలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టామని తెలిపారు. వర్షాల నేపథ్యంలో ఫిర్యాదుల కోసం నగరపాలక కార్యాలయంలో 9849907885 కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వెదురుకుప్పంలో నీట మునిగిన పంట పొలాలు

తంగేళిమిట్ట వద్ద ప్రమాదకరంగా ప్రవహిస్తున్న మద్దెలమడుగు వాగు
వాగు దాటలేక అవస్థలు పడుతున్న జనం

ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధం

జలవనరుల శాఖ ఎస్ఈ నగరసింహప్రసాద్

జిల్లాలో మరో మూడు రోజులు వర్షాలు కురిస్తే జిల్లాలోని చెరువులు పూర్తి స్థాయిలో నీటితో నిండే అవకాశముంది. చెరువుల వద్ద జలవనరులశాఖ అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. రోజూవారి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులోకి వస్తున్న వర్షాపు నీటిని అంచనా వేయడం జరుగుతోంది. నీవా నదికి సంబంధించి కాంక్రీట్‌వాల్ నిర్మాణం, బ్రిడ్జిల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడం జరిగింది. ప్రభుత్వం నుండీ నిధులు మంజూరు అయిన వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపట్టడం జరుగుతుంది. ఎన్‌టిఆర్ జలాశయం, కృష్ణాపురం రిజర్వాయర్ పూర్తిగా నీటితో నిండాయి దిగువకు నీటిని వదులుతున్నాం.

సంతపేటలో పర్యటించిన ఎమ్మెల్యే గురజాల

వర్షాల కారణంగా నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వేగంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎమ్మెల్యే సంతపేట ప్రధాన రహదారి, తోటపాళ్యం ప్రాంతాల్లో పర్యటించారు. ప్రధానంగా ఎగువున చెరువుల నుంచి వస్తున్న నీరు సంతపేట ప్రధాన రహదారి, వీధుల్లో ప్రవహిస్తుండడంతో ఈ నీటిని వివిధ మార్గాల్లో మళ్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సంతపేట ప్రధాన రహదారిలో కరుమారియమ్మ గుడి వద్ద రోడ్డుపై ఏర్పాటు చేసిన తత్కాలిక కల్వర్టర్‌ను పరిశీలించారు. వీధుల్లో పర్యటించి పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఎమ్మెల్యే వెంట మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకట రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న గాజులేరు, కప్పలేరు

రొంపిచెర్ల: భారీ వర్షాలకు రొంపిచెర్ల మండలంలోని గానుగచింత గ్రామపంచాయతీలో గాజులేరు, కప్పలేరు పొంగిపొర్లుతున్నాయి. చల్లంపల్లి ప్రాజెక్టు కూడా నిండి మొరవ పారుతోంది. అలాగే పలు కుంటలు నిండి మొరవపోతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలను కోరుతున్నారు. వర్షం కారణంగా బాలుర ఉన్నత పాఠశాలలోని వృక్షం నేలకొరిగింది. సుమారు 30 సంవత్సరాలకు పైబడిన చెట్టు వర్షానికి కూలింది. పాఠశాలకు సెలవు ప్రకటించడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. రొంపిచెర్లలోని తాటిమాకుల కుంట, బొమ్మయ్యగారిపల్లిలోని జమ్ము చెరువు నిండి మొరవ పోతున్నాయి. నిండిన చెరువులు, కుంటల వద్దకు వెళ్లరాదని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ కిరణ్ కుమార్ తెలిపారు.

శాశ్వత పరిష్కారం వైపు అడుగులు

ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు: పూతలపట్టు నుంచి పోలవరం రోడ్డు మార్గంలోని భీమా నదిపై నూతన వంతెన ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. ప్రస్తుతం భీమా నది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా యుద్ధప్రాతిపదికన తాత్కాలికమైన చర్యలు చేపడతామని ఆయన వివరించారు. బుధవారం ఆయన భీమ నదిపై దుస్థితిలో ఉన్న వంతెనను పరిశీలించారు. వరదల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా కలెక్టర్ ఆర్అండ్ బి అధికారులతో ఇదివరకే చర్చించడం జరిగిందన్నారు. ఆయన వెంట నాయకులు దొరబాబు చౌదరి, మురళి నాయుడు, గోపి, చంద్రమౌళి ఉన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న గుండుపల్లి వాగు

వెదురుకుప్పం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండాయి. వాగులు, వంకలు వరద నీటితో పొంగి ప్రమాదస్థాయిలో ప్రవహిస్తున్నాయి. అవతల వైపుకు చేరలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెదురుకుప్పం నుంచి దేవళంపేట వైపు వెళ్లే రహదారి, పెనుమూరుకు వెళ్లే రహదారిలోని గుండుపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంతో రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులు దారాల సహాయంతో అవతల నుంచి సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు. అలాగే తంగేలిమిట్ట వద్ద ఉన్న మద్దెలమడుగు వాగు ప్రవాహం ఎక్కువ కావడంతో దేవళంపేట, చిత్తూరు వైపు వెళ్లే బస్సులకు అంతరాయం కలిగింది. ఎస్సై వెంకటసుబ్బయ్య, రెవెన్యూ సిబ్బంది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

నేడు పాఠశాలలకు సెలవు: డీఈవో

జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల ప్రకారం నిరంతరాయంగా కురుస్తున్న వర్షాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని యాజమాన్యముల (ప్రభుత్వ/ప్రైవేటు) పాఠశాలలకు 23న సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువులు, వాగులు వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్

ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్

పలమనేరు: పలమనేరులో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పెద్దచెరువు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయ్యాయి. కౌండిన్య నదిలో జలప్రవాహం ఎక్కువగా ఉంది కనుక ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్‌కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి సూచించారు. ఎడతెరపిలేని వర్షాల వలన లోతట్టు ప్రాంతాలైన పలమనేరు పెద్దచెరువు ఎద్దుల, చెరువు ముంపు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ పరిశీలించి ఆయా ఏరియా వార్డు సెక్రటేరియలకు సహాయక చర్యల నిమిత్తం ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

గ్రామానికే పరిమితమైన జల్లిపేట ప్రజలు

పలమనేరు రూరల్ (గంగవరం):

పలమనేరు రూరల్ మండలం జల్లిపేట గ్రామానికి సమీపంలోని కౌండిన్య నది ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తోంది. నది వంతెన లేకపోవడంతో జల్లిపేట గ్రామస్తులు గ్రామానికే పరిమితమయ్యారు. కనీసం చుట్టుపక్కల గ్రామాలకు పోవడానికి వీలు లేకపోయింది. నీటి ప్రవాహం తగ్గేవరకు వారు గ్రామానికి పరిమితం కావల్సిన దుస్థితి నెలకొంది. ఈ గ్రామంతో కూర్మాయి, ముడేరుపల్లి గ్రామాలు పరిస్థితి ఇదే. కేవలం చెక్ డాం నిర్మించి వదిలివేయడంతో ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి దాటికి వ్యవసాయ భూములు సమేతం కొట్టుకుపోతున్నాయి. గత 50 సంవత్సరాలుగా ప్రజలు కౌండిన్యనదిపై వంతెన నిర్మించాలని మొరపెట్టుకున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వంతెన లేకపోవడంతో నదిలో ప్రవాహం వచ్చినప్పుడల్లా ప్రజల ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి నదిపై వంతెన నిర్మాణం చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరతున్నారు.

పాలారు పరవళ్ళు..

ఏడేళ్ల తర్వాత ఉధృతంగా ప్రవహిస్తున్న పాలారు

ప్రజాశక్తి- కుప్పం: కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు పాలారు నది పరవళ్ళు తొక్కుతోంది. దాదాపు ఏడేళ్ల తర్వాత పాలారు నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కర్ణాటక రాష్ట్రం నందికొండలో పుట్టి కర్ణాటకలో సుమారు 96 కిలోమీటర్ల మేరకు ప్రవహించే పాలారు నది కుప్పం నియోజకవర్గంలో 33 కిలోమీటర్లు మేరకు ప్రవహిస్తుంది. కుప్పం నియోజకవర్గంలో పాలారు నది చాలావరకు రిజర్వ్ ఫారెస్ట్‌లోనే ప్రవహిస్తుండగా వృధాగా పోతున్న నీటిని ఇక్కడి భూగర్భ జలాలు వృద్ధి చెందేందుకు ఉపయోగించుకోవాలని ఏపీ ప్రభుత్వం పాలారు నదిపై దాదాపు 40 చెక్ డ్యాములను నిర్మించారు. ప్రస్తుతం పాలరు నదిలోని చెక్ డాములు నిండి నీరు ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులోని కుప్పం మండలం పెద్దవంక శ్రీ కనకనాచమ్మ ఆలయం వద్దనున్న చెక్ డాం నిండి నీరు తమిళనాడుకు వెళుతోంది. పాలారు నది తమిళనాడులోని ఐదు జిల్లాల గుండా దాదాపు 222 కిలోమీటర్లు ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది.

పాలారు ప్రాజెక్టును అడ్డుకున్న తమిళనాడు

కుప్పం మీదుగా ప్రవహించే పాలారు నదిపై పాలరు ప్రాజెక్ట్ నిర్మాణానికి 2007లో అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రయత్నించగా రాజకీయాలకతీతంగా తమిళనాడు రాజకీయ పార్టీలు, అప్పటి జయలలిత ప్రభుత్వం అడ్డుకుంది. పాలారు నదిపై ఆంధ్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్మిస్తే తమిళనాడులోని వెల్లూరు, కాంచీపురం, తిరువన్నామలై, తిరువల్లూర్, చెన్నై జిల్లాలు ఎడారిగా మారుతుందని పాలారు ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదంటూ తమిళనాడు ప్రభుత్వం అప్పట్లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పాలార్ నదిపై 1956 అంతరాష్ట్ర నది నీటి వివాదాల చట్టం అమలులో ఉంది. ఒప్పంద నిబంధనలు ప్రకారం ఎగువ రాష్ట్రం, దిగువ రాష్ట్ర అనుమతి లేకుండా నదీ జలాలను అడ్డుకోవటానికి, మళ్లించడానికి లేదా నిల్వ చేయడానికి కొత్త ఆనకట్ట నిర్మాణం లేదా నిర్మాణం ఎత్తు పెంచటం అనుమతులు లేకుండా చేయకూడదని, అంతర్రాష్ట్ర జల ఒప్పందాలకు విరుద్ధంగా ఏపీలో పాలారు ప్రాజెక్టుపై నిర్మాణం చేపడితే ఎలాంటి పోరాటాలకైనా తాము సిద్ధమంటూ తమిళనాడు రాజకీయ పార్టీలు స్పష్టం చేసిన నేపథ్యంలో పాలరు ప్రాజెక్ట్ నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది.

కుప్పంలో మోడల్ గ్రంథాలయం

ప్రజాశక్తి -కుప్పం: సీఎం చంద్రబాబు ఆదేశాల నేపథ్యంలో కుప్పంలో త్వరలోనే మోడల్ గ్రంథాలయాన్ని నిర్మించడం జరుగుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, గ్రంథాలయ డైరెక్టర్ మునస్వామి పేర్కొన్నారు. కుప్పం పట్టణంలో శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయ భవనాన్ని బుధవారం ఎమ్మెల్సీ శ్రీకాంత్ పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రంథాలయ భవనం ఉరుస్తోంది. అన్ని వసతులతో మోడల్ గ్రంథాలయాన్ని నిర్మించడం జరుగుతుందని ఎమ్మెల్సీ తెలిపారు. గ్రంథాలయ భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ సోమశేఖర్, కో క్లస్టర్ శ్యామ్,ఆర్ ఆర్ రవి పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి

ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండలంలో దేవలంపేట పంచాయతీ పరిధిలోని పరిసర గ్రామాలలో వ్యవసాయ పంటలపై బుధవారం ఏనుగుల గుంపు దాడి చేయడంతో తీవ్ర నష్టం కలిగించాయి. రిజర్వు ఫారెస్ట్ నుంచి బయలుదేరిన ఏనుగుల గుంపు దేవళంపేటకు చెందిన రైతులు ప్రభాకర్, సుధాకర్, రమణమ్మ, బసవయ్య, విజయ సారథిలకు చెందిన వరి, టమోటా, మామిడి చెట్లను ధ్వంసం చేశాయి.



వ్యవసాయ పంటలను తొక్కుకుంటూ సమీపంలోనే అడవిలోకి ఏనుగులు గుంపు చేరుకున్నాయి. ఏనుగుల గుంపుతో నష్టపోతున్నామని, శాశ్వత పరిష్కార మార్గం చూపాలని రైతులు వేడుకుంటున్నారు.

నేటి నుంచి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర 13వ మహాసభలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఏపీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర 13వ మహాసభలు తిరుపతి నగరంలో ఈనెల 23,24 తేదీల్లో జరగనున్నాయి. తిరుపతి యశోద నగర్, వేమన విజ్ఞాన కేంద్రం ఇందుకు వేదిక కానుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 350 మంది ప్రతినిధులు, ఏఐఆర్డబ్ల్యుఎఫ్ జాతియ నాయకులు, జాతీయ రవాణా రంగ ప్రముఖులు మహాసభలకు ఈ సభలకరు హాజరుకానున్నారు. ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ రాష్ట్ర మహాసభలకు తిరుపతి జిల్లా, జోనల్ కమిటీలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. కేంద్ర ప్రభుత్వం పీఎంఈ సేవా పథకం పేరిట బీసీసీ పద్ధతిలో ప్రైవేటు విద్యుత్ బస్సులను ఆర్టీసీల పేరుతో తిప్పనుంది. ఈపాటికి అలిపిరి డిపోలో ఉన్న 100 విద్యుత్ బస్సులు ప్రైవేట్ అద్దె బస్సులే. ఆర్టీసీలో మొదటి విడతగా విఎన్ఈ 50 బస్సులు 12 డిపోలలో, రెండవ విడతగా 1250 బస్సులను 19 డిపోలలో తీసుకురానున్నారు. ఈ బస్సులు వస్తే రాష్ట్రవ్యాప్తంగా 31 డిపోలు మూతపడనున్నాయి. 2029 నాటికి ఇప్పుడున్న బస్సులు అన్నిటిని విద్యుత్ ప్రైవేట్ బస్సులుగా మార్చాలని జీవో నెంబర్ 88 ప్రభుత్వం విడుదల చేసింది. దీనికి తోడు గత నెలలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పని గంటలు 8 నుంచి 10 గంటలకు పెంచాలని మహిళలు రాత్రిపూట కూడా పనిచేయాలని తీర్మానించారు. ఈపాటికి రోజుకు పదిగంటలు పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికుల పనిగంటలు మరింత పెంచనున్నారు. మహిళలకు ఉచిత బస్సు పేరుతో రన్నింగ్ సిబ్బందిపై రెండు గంటల పని ఇప్పటికే పెరిగింది. ఆర్టీసీలో ఉన్న 5000 మంది మహిళలు రాత్రివేళలో కూడా పనిచేయాల్సి వస్తుంది. నేడు ఆర్టీసీల విలువైన స్థలాలను నగర నడిబొడ్డులో ఉన్న బస్టాండ్లను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి అనే సాకుతో కార్పొరేటర్లకు, పెట్టుబడిదారులకు బహుళ జాతి షాపింగ్ మాల్స్ పేరుతో కట్టబెడుతున్నది. ఇలాంటి తరుణంలో ప్రభుత్వ రంగ సంస్థల ఏపీఎస్ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆ సంస్థలో పనిచేస్తున్న కార్మికులదే. అటు సంస్థను కాపాడుకుంటూ ఇటు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరుబాట నడుపుతున్న ఏపీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్, రాష్ట్ర 13వ మహాసభల ద్వారా భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు సిద్ధమవుతుంది. గత రెండు రోజులుగా తిరుపతి వేమన్న విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం నాయకులు రాత్రి పగలు తేడా లేకుండా మహాసభల నిర్వహణ కొరకు అలుపెరగని కృషి చేస్తున్నారు. 23, 24 తేదీలు రెండు రోడ్లు పాటు జరిగే ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పిలుపునిచ్చారు.

వేమన విజ్ఞాన కేంద్రంలో మహా సభలకు ఏర్పాట్లు చేస్తున్న నాయకులు

గరుడ వారధి పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి గరుడ వారధి పైనుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మున్సిపల్ పార్క్ ఎదురుగా గరుడ వారిది ఫ్లై ఓవర్ నుంచి 40-50 మధ్య వయసు ఉన్న గుర్తుతెలియని వ్యక్తిగా దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఫ్లైఓవర్ నుంచి కింద పడే రక్త గాయాలతో కొట్టుకుంటున్న వ్యక్తిని గమనించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ అక్కడికి వచ్చేలోపు ఆ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద సెల్ ఫోన్ లభించడంతో దాని ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని తిరుపతి రుయా మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'అపోలో' సంఘటనపై విచారణ

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విజయ భారతి సాయనీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఇటీవల చిత్తూరు అపోలో యూనివర్సిటీలో విద్యార్థినుల బాత్ రూమ్‌లో రహస్య కెమెరాల వ్యవహారంపై పోలీస్ విచారణ కొనసాగుతోందని, దోషులను కఠినంగా శిక్షించాలని పోలీస్ వారిని కోరామని మానవ హక్కుల కమిషన్ మెంబర్ విజయ భారతి సాయనీ పేర్కొన్నారు. బుధవారం చిత్తూరు మురకంబట్టులోని చిత్తూరు అపోలో యూనివర్సిటీని జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్ సందర్శించి యూనివర్సిటీ సిబ్బందితో సమీక్షించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ ఇటీవల చిత్తూరు అపోలో యూనివర్సిటీలో విద్యార్థినుల బాత్ రూమ్‌లో రహస్య కెమెరాల వ్యవహారాన్ని వార్తా పత్రికలు, టివి ఛానళ్ళ ద్వారా చూసి మానవ హక్కుల ఉల్లంఘున కింద సోమోటోగా తీసుకుని విచారణకు రావడం జరిగిందని తెలిపారు. సంఘటనకు సంబంధించి పోలీస్ విచారణ జరుగుతున్నదని, పూర్తి వివరాలను వెలువరించలేమన్నారు. అనుమానితులను పోలీస్ అరెస్ట్ చేయగా, ప్రస్తుతం బెయిల్ పై బయటకు వచ్చారని తెలిపారు. పోలీస్ అధికారులు పారదర్శకతతో విచారణను వేగవంతం చేసి దోషులను తొందరగా న్యాయస్థానం ముందు నిలిపి శిక్షపడేలా చూడాలని కోరామన్నారు. కళాశాలలో నియమాల ప్రకారం విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అంతర్గత కమిటీ ఏర్పాటు చేశారన్నారు. కళాశాల విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడగా సమస్యలేవీ లేవని తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. వీరితో పాటు కళాశాల ఛైర్మన్, అధ్యపకులతో సమీక్షించడం జరిగిందన్నారు. ఆఫీసర్లు ఎన్.జ్యోతి, హరినాథ్ రెడ్డి, విశ్వవిద్యాలయ రిజిస్టర్ పోతురాజు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నరేష్ రెడ్డి, డీఎస్పీలు పాల్గొన్నారు.

బస్ షెల్టర్‌కు దిక్కేది?

- ఎండ, వాన నుంచి రక్షణ ఏది?
- మరుగుదొడ్ల సౌకర్యం కరువు..
- స్పందించని పాలకులు, అధికారులు
- స్థానికుల ఆందోళన

బస్ షెల్టరు లేక ప్రయాణికులు ఎండకు, వానకు పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదు. దీంతో ఆ ఊరి పరసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఎన్నికల సమయంలో తమ వద్దకు ఓట్ల కోసం వచ్చే నాయకులు అన్ని సమస్యలు పరిష్కరిస్తామని మాయమాటలు చెప్పి గెలిచిన తర్వాత చివరకు తమ గ్రామం వైపు తలెత్తికూడా చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు వెంటనే స్పందించాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజాశక్తి -పుంగనూరు: మండలంలో పలుచోట్ల బస్సు షెల్టర్లు కరువయ్యాయి. వర్షం, ఎండకు బస్సు కోసం వెళ్లే స్థానికులు తాళలేక తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

బస్ షెల్టర్‌కు దిక్కేది?

పుంగనూరు నలువైపులా ఉన్న గ్రామాల నుండి వేరే రాష్ట్రాల నుండి ఎంతో మంది నిత్యం పుంగనూరు నుండి పక్కనే వున్న కర్ణాటకకకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వారు వెళ్లే సమయంలో,ప్రయాణం చెయ్యడానికి బస్ షెల్టర్ వద్ద నిలబడే వారు. అయితే రోడ్డు విస్తరణ పనులు చేసే సమయంలో ఇక్కడ వున్న బస్సు షెల్టర్‌ను కూల్చి వేశారు. ఇక అప్పటి నుంచి రోడ్డుపైనేప్రయాణికులు నిల్చొని బస్సులు ఎక్కాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు.

మరుగుదొడ్ల సౌకర్యం కరువు..

పట్టణంలో ఉన్న బస్ షెల్టర్‌లు పడగొట్టినప్పటి నుంచి ప్రజలు పడరాన్ని పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం ప్రజలు నిలబడడానికి సైతం షెల్టర్ కరువైంది. ఆడ బిడ్డలు మరుగుదొడ్లకు వెళ్లాలన్నా పట్టణంలో అవి కూడా పూర్తిగా లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సుల కోసం వచ్చే వృద్ధులు, అనారోగ్యంతో ఆస్పత్రులకు వెళ్లే వారు ఎండకు, వానకు నిల్చోలేక నానా అవస్థలు పడుతున్నారు. విద్యార్థు లు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పుంగనూరు పట్టణంలో బస్సు షెల్టరు లేక ఎండలో నిరీక్షిస్తున్న విద్యార్థులు

స్పందించని పాలకులు, అధికారులు

అధికారులు ప్రజల కష్టాలు గమనించి వెంటనే బస్ షెల్టర్ లు, మరుగుదొడ్లు నిర్మించాలని పట్టణ వాసులు కోతున్నారు. పాలకులు దీనిపై దృష్టి సారించి ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాల్సి వుంది.

ఉపాధి సిబ్బందికి నోటీసులు జారీ

ప్రజాశక్తి -శాంతిపురం: ఉపాధి హామీ జాబ్ కార్డు దారులకు ఈకేవైసీ చేయించడంలో ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో ఎంపీడీవో కుమార్ బుధవారం నోటీసులు జారీ చేశారు. కర్లగట్ట పంచాయతీకి చెందిన బాల కుమార్, కోనేరు కుప్పం పంచాయతీకి చెందిన ఖలీల్, చెంగుబల్ల పంచాయతీకి చెందిన ఫీల్డు అసిస్టెంట్లు జయకుమార్, గుంజార్లపల్లి జ్యోతి ప్రసాద్ ఉపాధి హామీలో వున్న జాబ్ కార్డు దారులకు ఈకేవైసీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కాని పై తెలిపిన సిబ్బంది వీరి విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం చూపించారు. వీరి అలసత్వం కారణంగా మండలం పురోగతిలో వెనుకబడింది. వీరి నిర్లక్ష్యం వల్ల కూలీలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. వీరిని విధుల నుండి ఎందుకు తొలగించ కూడదో నోటీసులను జారీ చేశారు. వీరు 24 గంటలలోపు ఎంపీడీవో ముందు సంజాయిషీతో కూడిన వివరణతో హాజరు కావాలని ఎంపీడీవో ఆదేశించారు. లేకుంటే వీరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో బాలాజీ

అప్రమత్తంగా ఉండాలి: ఎంపీడీవో

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ఇటీవల విస్తారంగా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం కారణంగా ప్రజలను అప్రమత్తంగా ఉండేందుకు అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో సూచించారు. రాయలపేట సచివాలయాన్ని ఎంపీడీఓ బాలాజీ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాన్ని సందర్శించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. వర్షాలు కురుస్తున్న కారణంగా చెరువులు, కుంటల వద్ద అప్రమత్తంగా ఉండాలని, అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేడిచేసి చల్లార్చిన నీటిని తాగేలా అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణను నిరంతరం కొనసాగించాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్‌లు నిరంతరం సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను నీటి కుంటల వద్దకు వెళ్లనీయకుండా జాగ్రత్త తీసుకోవాలని తల్లిదండ్రులకు, సచివాలయ సిబ్బంది సూచించాలన్నారు.

పాలసముద్రం: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ చిన్న రెడ్డప్ప అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజలు అత్య వసరం అయితే తప్ప బయటకు వెళ్లకూడదని, విద్యుత్ స్తంభాలు తీగలకు దూరంగా ఉండాలని రైతు లకు పొలాల దగ్గరకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని చెట్ల కింద ఉండకూడదని వాగులు వంకలు దగ్గర చిన్న పిల్లలు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అత్యవసరమైనప్పుడు 112 కు డయల్ చేయాలని పోలీస్ సిబ్బంది ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు.

పలు హోటళ్లలో తనిఖీలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పురపాలక సంఘ కమిషనర్ మంజునాథ్ గౌడ్ ఆదేశాల మేరకు, బుధవారం శానిటరీ ఇన్స్పెక్టర్ మోహన్ కృష్ణ, అముదవల్లి, రెడ్డి ప్రతాప్, మునస్వామి, పుత్తూరు పురపాలక సంఘ పరిధిలోని హోటల్లలో తనిఖీలు నిర్వహించారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ కవర్లను వినియోగించిన వారికి జరిమానాలు విధించారు.

ఎస్వీయూ భవిష్యత్ సైన్స్ సహకారంపై చర్చ

ప్రజాశక్తి - క్యాంపస్ : అమరావతిలోని ఎస్ఆర్ఎమ్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆచార్య నారాయణరావు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయాన్ని సందర్శించి, ఉప కులపతి ఆచార్య తాతా నరసింగ రావును బుధవారం ఛాంబర్‌లో కలిశారు. సమావేశంలో ఇద్దరు విద్యా వేత్తలు 2 ప్రతిష్ఠాత్మక సంస్థల మధ్య విద్య, పరిశోధన సహకారాలను బలోపేతం చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. భవిష్యత్ శాస్త్రీయ పురోగతి, స్థిరమైన ఇంధన పరిష్కారాల కోసం గుర్తించబడిన క్వాంటం టెక్నాలజీ, హైడ్రోజన్ మొబిలిటీలో ఉమ్మడి పరిశోధన చొరవలను చేయాలనిచ చర్యలు జరిపారు. అధ్యాపకుల పరస్పర సహకారం, ఉమ్మడి పరిశోధన ప్రతిపాదనలు, పరిశ్రమల నిపుణులతో కూడిన జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ల నిర్వహణ వంటి అంశాల అవగాహనతో సమావేశం ముగిసింది.

ప్రపంచ స్థాయి పోటీకి అనుగుణంగా ఎస్వీయూ ఇంజినీరింగ్ సిలబస్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ఆచార్య తాతా నరసింగరావు బుధవారం తన ఛాంబర్‌లో యస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్, వైస్-ప్రిన్సిపాల్, డీన్, ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ అన్ని విభాగాధిపతులు పాల్గొన్నారు. పాఠ్యాంశాల రూపకల్పన, తరగతుల నిర్వహణ టైమ్‌టేబుల్, ప్లేస్‌మెంట్ వంటి కార్యకలాపాలపై దృష్టి సారించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఇంజినీరింగ్ విద్య ప్రపంచ వ్యాప్తంగా డైనమిక్‌గా మారుతుంది, దాన్ని మనం అందుకోవాలని వీసి చెప్పారు. జాతీయ విద్యా విధానం అనుగుణంగా ఉండేలా తమ విభాగాలు తమ సిలబస్, ల్యాబ్, మౌలిక సదుపాయాలు, బోధనా పద్ధతులను కాలానుగుణంగా సమీక్షించాలని వీసి ఆదేశించారు.

ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న వైసిపి నాయకులు

మిథున్‌రెడ్డికి పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-చౌడేపల్లి: ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 80వ సెషన్‌కు16 మంది ఎంపీల బృందంతో ఆంధ్రప్రదేశ్ నుండి యువ నేత రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి విదేశీ పర్యటనకు వెళుతున్న సందర్భంగా వారిని హైదరాబాదులోని స్వగృహంలో ఇరిగేషన్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రవిచంద్రా రెడ్డి, వైసిపి రాష్ట్ర విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ప్రజలకు చేసిన సేవకు ఇంతటి గుర్తింపు తెచ్చాయని కొనియాడారు. తండ్రికి తగ్గ తనయుడిగా ప్రజా సేవలో మరింత ముందుకు వెళ్లి రాష్ట్రానికి దేశానికి గొప్ప కీర్తి ప్రతిష్టలు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి నాయకులు పుంగనూరు, రాజంపేట పార్లమెంట్ నియోజక వర్గంలో ఉండటం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఈవో పెంచలకిషోర్

కాణిపాకం ఆలయ ఈవో సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి-ఐరాల: శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పెంచల కిషోర్ దేవస్థానం పరిసర ప్రాంతాలలో బుధవారం సుడిగాలి పర్యటన నిర్వహించి వర్ష ప్రభావంతో నీళ్లు నిలుస్తున్న ప్రాంతాలు, పారిశుద్ధ్యం, పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని దేవస్థానం అధికారులకు సూచించారు. ఇన్నెండ, టాయిలెట్స్, కల్యాణకట్ట, తదితర ప్రాంతాల్లో పరిశీలించి శానిటేషన్ పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకట నారాయణ, ఏఈలు అరవింద్, పవన్, దుర్గ, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షం ప్రభావాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి

లోతట్టు ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ పరిధిలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా పలమనేరు మునిసిపల్ కమిషనర్ ఎన్‌వి రమణా రెడ్డి వర్షాల ప్రభావిత ప్రాంతాలు లోతట్టు, ముంపు ప్రాంతాలను తనిఖీ చేశారు. స్థానిక పెద్ద చెరువును పరిశీలించారు.

గ్రానైట్ పరిశ్రమలో కార్మికులకు భద్రత కరువు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక పురపాలక సంఘం పరిధిలోని చెర్లోపల్లి గ్రానైట్ క్వారీలో పని చేస్తున్న కార్మికులకు భద్రత, వసతులు కరువయ్యాయని సిపిఐ పార్టీ పుత్తూరు మండల సమితి ఆధ్వర్యంలో బుధవారం తాహశీల్దార్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ పుత్తూరు మండల కార్యదర్శి డి.మహేష్ మాట్లాడుతూ మండల పరిధిలోని క్వారీల్లో, గ్రానైట్ క్వారీల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించాలని, కనీస వసతులు కల్పించాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల ప్రమాదాల బారిన పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సిఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐలు

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం: సీఐ

ప్రజాశక్తి -కార్వేటినగరం : పోలీసు త్యాగాలు చిరస్మరణీ యమని సిఐ హనుమంతప్ప పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల కుటుంబాలకు కృతజ్ఞతలు తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తారని, అలాంటి పోలీసులను గౌరవించాలన్నారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధనకు అడుగులు వేస్తున్న పోలీసులకు ఆయన అభినందనలు తెలిపారు. పోలీసు యంత్రాంగం ఎంతో అంకితభావంతో పని చేస్తోందని కొనియాడారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సిఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో స్థానిక పోలీసు స్టేషన్ నుంచి గాంధీ మిట్ట కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సుమన్, కార్వేటినగరం ట్రైనీ ఎస్ఐ రమేష్ నాయక్, పాలసముద్రం మండల ఎస్ఐ చిన్న రెడ్డప్ప, పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.

వన్యప్రాణులకు విద్యుత్ అమర్చిన వారిపై చర్యలు: ఏఈ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: వన్యప్రాణులకు విద్యుత్ అమర్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ లక్ష్మీ ప్రసన్న పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అటవీ ప్రాంతంలోని సమీప దాయాల్లోని వ్యవసాయ పొలంలో 11 కెవి విద్యుత్ లైన్ల నుండి విద్యుత్తును వన్య ప్రాణుల వేటకు ఉపయోగిస్తున్నారని వాటి ద్వారా మనుషులకు కూడా ప్రమాదం ఎదురయ్యే అవకాశం వుందన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని తెలిపారు. వన్యప్రాణుల కోసం విద్యుత్ అమర్చి వాటి మాంసాన్ని విక్రయించి లబ్ది పొందుతున్నారని, అలాంటి వారిపై పలు సెక్షన్ల కేసులు నమోదు చేస్తామని తెలిపారు. వ్యవసాయ భూముల్లో విద్యుత్ వైర్లు అమర్చినట్లు సమాచారం వచ్చిన వ్యవసాయ భూమికి చెందిన వారిపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు. ఈ కారణంగా విద్యుత్తును వన్యప్రాణుల వేట కు ఉపయోగించకూడదని తెలిపారు.

గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్న వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి

కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత

వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు కోదండ రెడ్డి

ప్రజాశక్తి- శాంతిపురం: గతంలో ప్రజాసంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చినట్లే రానున్న కాలంలో కార్యకర్తల సంక్షేమానికి, రక్షణకు పెద్దపీట వేసి పార్టీ పటిష్టతకు జగన్ మోహన్ రెడ్డి కృషిచేస్తారని ఆ జిల్లా ఉపాధ్యక్షుడు కోదండ రెడ్డి స్పష్టం చేశారు. చిన్నారి దొడ్డి 121 పెద్దూరు పంచాయతీల కమిటీల ఏర్పాటుకు బుధవారం సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లో కమిటీ సభ్యులు కీలకమని జిల్లా ఉపాధ్యక్షుడు పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు గ్రామ స్థాయి పార్టీ బలోపేతానికి గ్రామ పంచాయతీ పార్టీ కమిటీల నియామకాన్ని చేపడుతూ పార్టీకి కష్టపడే వారిని అధిష్టానం ఎప్పుడూ గుర్తిస్తుందని కుటుంబంలో ఆ పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి పేర్కొన్నారు. మండల పరిధిలోని పార్టీ సమావేశాలు ఏర్పాటు ఒక పంచాయతీకి 15 మందితో పంచాయతీ కమిటీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీకి పట్టుకొమ్మలైన కార్యకర్తలకు జగన్ మోహన్ రెడ్డి తీసుకొచ్చిన డిజిటల్ బుక్ కొండంత అండ అని, కార్యకర్తలకు బీమా సౌకర్యం, గుర్తింపు కార్డులు అందించడానికి పార్టీ కృతనిశ్చయంతో వుందన్నారు. అనంతరం రెండు పంచాయతీల్లోనూ పార్టీ అధ్యక్షులను ఎన్నుకొన్నారు. చిన్నారి దొడ్డి అధ్యక్షుడిగా మురళి, 121 పెద్దూరు అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ స్టేట్ డైరెక్టర్ కృష్ణమూర్తి, నడింపల్లి చలపతి, సర్పంచ్ వెంకట్రామ రెడ్డి, రేణుక, బాలసుబ్రహ్మణ్యం, నాయకులు మునిగోపాల్, మొగుళేశ్వర్, గంగాధరం, బాబు రెడ్డి, రామకృష్ణ, కృష్ణప్ప పాల్గొన్నారు.

నిరుపేదల పక్షపాతి శంకరన్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నిరుపేదల అసమానతలు తొలగించడం కోసం, ప్రభుత్వ అధికార వ్యవస్థలను ప్రజల దగ్గరగా చేర్చి నీతి, నిజాయితీ, నిబద్ధతకు నిలువెత్తు ఐఏఎస్ గా ఎస్ఆర్ శంకరన్ తన జీవితం చివరి వరకు కట్టుబడ్డారని పలువురు వక్తలు కొనియాడారు. శంకరన్ 91వ జయంతిని బుధవారం తిరుపతి యూత్ హాస్టల్లో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జీవకోన అధ్యక్షుడు సి. సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి. అంజయ్య, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. విజయ్ కుమార్, టిటిడి ఎస్సీ ,ఎస్టీ, ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ .ఎం. ప్రసాదరావు, మాదిగ సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాసులు, దళిత సీనియర్ నాయకులు దుగ్గాని జయరాం పాల్గొని మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ఆర్థిక అసమానతలు తొలగి ప్రతి ఒక్కరూ గౌరవప్రదంగా జీవించాలని, భావించి తన అధికారాన్ని పేదలకు అందించి, దళిత ,ఆదివాసి హృదయాలలో స్థిర స్థాయిగా మిగిలిన ఏకైక ఐఏఎస్ అధికారి శంకరన్ అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత గౌడగు వింత గోవిందయ్య, గెజిటెడ్ అధికారుల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి, బీసీ సంఘర్షణ సమితి గౌరవ అధ్యక్షులు బుసగాని లక్ష్మయ్య, బీసీ నాయకులు అక్కినపల్లి లక్ష్మయ్య, భారతీయ దళిత సాహిత్య అకాడమీ అధ్యక్షులు ధన శేఖర్, సిపిఐ నాయకులు చిన్నం పెంచలయ్య, ఆర్.పి.ఐ జిల్లా అధ్యక్షులు ఏ సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ రిటైర్డ్ ప్రిన్సిపాల్ సాకం సుధాకర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి సుబ్బరాయుడు, టిటిడి కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ తలారి మహేష్, తదితరులు పాల్గొన్నారు. సభ అనంతరం ఎస్ ఆర్ శంకరన్ విగ్రహాన్ని తిరుపతిలో ప్రతిష్టించడానికి ఒక కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా పి .అంజయ్య, అక్కినపల్లి లక్ష్మయ్య, ,డాక్టర్ ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా టి విజయ్ కుమార్, కార్యదర్శిగా బుసగాని లక్ష్మయ్య, కోశాధికారిగా సాకం సుధాకర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంతర్జాతీయ సదస్సులో ఎన్ఎస్‌యు అసిస్టెంట్ ప్రొఫెసర్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కుమార్ బాగేవాడిమఠ్ ఇండోనేషియాలోని బాలిలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నారు. గ్లోబల్ సంస్కృత ఫోరం, భారత్, ఐఐటి సుగ్రీవా స్టేట్ హిందూ యూనివర్సిటీ, డెన్‌పసర్, యాయాసన్ ధర్మ స్థాపనం, ఇండోనేషియాతో కలిసి ఈ సదస్సు నిర్వహించబడింది. "సమకాలీన విద్య వర్గాన్ ప్రాచీన భారతీయ విద్యా వ్యవస్థ: తులనాత్మక విశ్లేషణ" అనే అంశంపై డా.కుమార్ ఒక ప్రెజెంటేషన్ ఇచ్చారు. భారతీయ జ్ఞాన వ్యవస్థను మరియు సంస్కృత జ్ఞానానికి ఎలా గుర్తింపునివ్వాలి ఉందో ఆయన వివరించారు. ఆధునిక విద్యా వ్యవస్థకు పురాతన అభ్యాస పద్ధతులను ఎలా స్వీకరించాలో మెరుగైన వాటిపై ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వీసీ ప్రొ కృష్ణమూర్తి ఆయన కృషిని అభినందించారు. ఎన్ఎస్‌యు అధి కారులు, అధ్యాప

కుల కుమార్‌ను అభినందించారు.

క్రైం న్యూస్

పోలీసులకు పట్టుబడ్డ పేకాటరాయుళ్లు

పేకాటరాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి-చౌడేపల్లి: పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎస్ఐ కథనం మేరకు..మండలంలోని పెద్ద కొండా పంచాయతీ బోయకొండ వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి పక్కనే ఓ కోళ్ల ఫారంలో పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం వచ్చిందని, వెంటనే పీఎస్ఐ మణికంఠేశ్వర్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద వున్న 52 పేక ముక్కలు, రూ 10,140లు నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

పోలీసులతో వాగ్వివాదానికి దిగిన మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడపై కేసు

అనుచరులు పది మందిపై కేసు

ప్రజాశక్తి- పలమనేరు: ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతకు జేసీబీతో వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ , అతని అనుచరులు పలమనేరు అర్బన్ ఎస్ఐ లోకేష్ రెడ్డితో దురుసు ప్రవర్తన, అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే. పర్యవసానంగా మాజీ ఎమ్మెల్యేపై, అతని అనుచరులపై ఎస్ఐ లోకేష్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడతో పాటు అతని అనుచరులు పది మందిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ

12 మేకలు మృతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మేకలు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని కంటైనర్ ఢీకొంది. దీంతో 12 మేకలు మృతి చెందాయి. ఈ ఘటన బుధవారం రాత్రి మండలంలోని గుండ్ల కట్ట మంచి వద్ద చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన మునిరాజు మేకలు మేపుతూ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని కంటైనర్ ఢీకొంది. దీంతో 12 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. బాధితుడు మునిరాజు మేకల ఆధారంతోనే జీవనం కొనసాగిస్తున్నారని జీవనాధారమైన జీవులను పోగొట్టుకుని ఆందోళనలో వున్నాడని ప్రభుత్వం ఆదుకోవాలని మునిరాజులు కోరారు.

ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న మదనపల్లె టౌన్ బ్యాంకు సిబ్బంది

శత జయంతి ఉత్సవాలకు రండి..

ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి- పలమనేరు: త్వరలో నిర్వహించనున్న మదనపల్లె కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ శత జయంతి ఉత్సవాలకు రావాలని మాజీ మంత్రి, పలమనేరు నియోజకవర్గ ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని టౌన్ బ్యాంక్ చైర్మన్ నాథెళ్ల శ్రీనివాసులు ఆహ్వానించారు. బుధవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసిన కలిసిన వారు మదనపల్లె కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ శతజయంతి ఉత్సవాలకు విచ్చేయాలని ఆహ్వానించారు.

కూలిన ఇంటిని పరిశీలిస్తున్న దృశ్యం

వర్షాలకు కూలిన ఇల్లు

ప్రజాశక్తి - విజయపురం (నగరి) : మండలంలోని ముదిపల్లె గ్రామంలో వరుస వర్షాలకు తడిసిపోవడంతో కె కోకిలకు చెందిన ఇల్లు బుధవారం కూలిపోయింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఎవరూ లోపల లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కూలిన ఇంటి వివరాలను సచివాలయ సిబ్బంది సేకరించారు. ఏవిధమైన వరదలు, ప్రమాదాలు సంభవించిన పలమనేరు పురపాలక సంఘం టోల్ ఫ్రీ నెం.7337388215 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.